

లిపి లేని కంటి భాష.. చిత్రం

ఈ పరికరం 'కన్ను'మూస్తే అందులో బంధించిన దృశ్యం కలకాలం సజీవంగా ఉంటుంది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

8లో



దూసుకొచ్చిన మృత్యువు

మృత్యు రూపంలో దూసుకొచ్చిన కారు ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఆదివారం కోరంగిలో పాదచారి, ఆటోపైకి కారు దూసుకెళ్లడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

4.84 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: వరద ఉధృతితో కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం రాత్రి 4,84,214 క్యూసెక్కులను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.80 అడుగులకు చేరింది. వర్షాల కారణంగా గోదావరి డెల్టా కాలువలకు నీటి విడుదలను 2,200 క్యూసెక్కులకు తగ్గించారు.

న్యూస్‌రీల్


పంచారామ క్షేత్రంలో రేపు వేద పరిషత్



సామర్లకోటలోని పంచారామ క్షేత్రం

సామర్లకోట: ఏటా నిర్వహిస్తున్న వేద పరిషత్‌ను మంగళవారం పంచారామ క్షేత్రం శ్రీబాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు పరిషత్ కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పూర్వపు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని వేదపండితులచే 27వ వేద సభ నిర్వహించి వేదపండితులను సత్కరించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా లోక కల్యాణార్థం హిందూ సంస్కృతి, సంప్రదాయానుసారంగా చతుర్వేద పారాయణ, వేద స్వస్తి జరుగుతుందని చెప్పారు.

ఏలేరులో పెరిగిన నీటి నిల్వలు



ఏలేరు ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఏలేరు ప్రాజెక్టులో ఆదివారం నాటికి స్వల్పంగా నీటి నిల్వలు పెరిగాయి. ఎగువ ప్రాంతంలో వర్షాలు ఎక్కువగా ఉండడంతో నీటిప్రవాహం పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి 646 క్యూసెక్కులు, పురుషోత్తపట్నం నుంచి 1225 క్యూసెక్కుల నీరు చేరడంతో ప్రాజెక్టులో స్వల్పంగా నీటి నిల్వలు పెరిగాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు 78.49 మీటర్లు, 24.11 టీఎంసీలకు 11.77 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో ప్రాజెక్టు నుంచి ఆయకట్టు 400, విశాఖకు 200, తిమ్మరాజుచెరువుకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

లోవకు భక్తుల తాకిడి

– రూ.4.33 లక్షల ఆదాయం



లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ తల్లి

తుని రూరల్: జోరువానలోను తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వచ్చిన 13 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తుండడంతో వంటలు, భోజనాలు చేసేందుకు భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. టార్పాలిన్‌ను కట్టుకుని వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నారు. పులిహోర, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,43,280, పూజా టికెట్లకు రూ.1,27,400, కేశఖండనశాలకు రూ.12,800, వాహన పూజలకు రూ.4350, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.96,216, విరాళాలు రూ.49,117 వెరసి మొత్తం రూ.4,33,163 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు.

పులసా గోదారంటే అలుసా!

- ఈ వైపు కన్నెత్తి చూడని జలపుష్పం
- ఒడిశా, బెంగాల్ వైపు పయనం
- జిహ్వ జివ్వున లాగేస్తున్నా కానరాని ఆచూకీ
- మూసుకుపోయిన సముద్ర మొగలు
- కేజీ బేసిన్‌లో చమురు కార్యకలాపాలు
- ప్రాణభయమూ మరో కారణం
- ఒకప్పుడు నాలుగున్నర కేజీలుండే పులస
- ఇప్పుడు కిలో దొరకడమే గగనం





యానాం మార్కెట్‌లో పులస వేలం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'గోదాట్లో నీరు ఎరుపెక్కిందంటే నా సామిరంగా.. సముద్రం నుంచి పులస లగెత్తుకు రావాల్సిందే. వెంటనే పుస్తెలు అమ్మయినా పులస పులుసు తినాల్సిందే' అంటుంటారు గోదావరి జిల్లాల వాసులు. ఏడాదికి ఒకసారి మాత్రమే అదికూడా గోదావరికి వరద నీరు వచ్చినప్పుడు మాత్రమే కనిపించే పులసలు ఈసారి మొహం చాటేస్తున్నాయి. గోదావరికి వరదలు వచ్చి ఎర్రనీరు పోటెత్తుతున్నా పులస జాడ లేదు. గత సీజన్లతో పోలిస్తే పులసలు ఎప్పుడూ ఈ స్థాయిలో తగ్గిపోలేదని ఇక్కడ మత్స్యకారులు మదనపడుతున్నారు. వాస్తవానికి జూలై మొదటి వారం నుంచే పులసలు గోదావరిలో సందడి చేస్తాయి. ఆగస్టు మూడోవారం వచ్చేసినా వాటి జాడ ఎక్కడా కనిపించడం లేదు. ఈ నెలాఖరుకైనా రాకుండా పోతాయా అని గోదావరి జిల్లాల జనం ఎదురు చూస్తున్నారు.

ముచ్చటగా మూడు

ఈ సీజన్‌లో ఇప్పటివరకూ ముచ్చటగా మూడంటే మూడు పులసలు మాత్రమే మత్స్యకారులకు దొరికాయి. కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం పరిసర ప్రాంతాల్లో 20 రోజుల వ్యవధిలో మత్స్యకారుల వలలకు చిక్కాయి. కిలో పులస రూ.20 వేల నుంచి రూ.26 వేల వరకూ.. అది కూడా వేలంలో సొంతం చేసుకుంటున్నారు. కొందరైతే మత్స్యకారులకు రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ కూడా చేసుకుంటున్నారు. ఒకప్పుడు కేజీ నుంచి మూడున్నర కేజీలు, కొన్ని 4, 5 కేజీలున్న పులసలు కూడా మత్స్యకారుల వలకు చిక్కేవి. నాలుగైదు కేజీలున్న పులసలు ఐదారు వలలో పడ్డాయంటే వారి పంట పండినట్టే. నాలుగైదు కేజీల పులస రూ.10 వేల నుంచి రూ.15 వేలు పలికేది. గోదావరి తీరంలో ఒకప్పుడు యానాం, భైరవపాలెం, కోటిపల్లి, ఎదుర్లంక, రావులపాలెం, సిద్ధాంతం తదితర ప్రాంతాల్లో పులసలు విరివిగా లభించేవి. మత్స్యకారులు అర్ధరాత్రి నుంచి తెల్లారే వరకూ ఈ ప్రాంతాల్లోనే వేటాడేవారు. అటువంటిది ఇక్కడ కూడా పులసలు దొరక్క వారు నిరాశతో ఇళ్లకు తిరిగొచ్చేస్తున్నారు. గతంలో వరదల సీజన్ మొదలయ్యాక ప్రతి నెలా 40 టన్నులకు తక్కువ కాకుండా పులసలు పడేవన్నది మత్స్యశాఖ అంచనా. ప్రస్తుతం ఇందులో 10 శాతం కూడా ఈసారి కనిపించడం లేదని అంటున్నారు.



వేలంలో రూ.26 వేలకు పులస దక్కించుకున్న పేరవరానికి చెందిన బెజవాడ సతీష్

చమురు సంస్థల కార్యకలాపాలతో..

పులసలు పునరుత్పత్తి కోసం బంగాళాఖాతంలో 11 వేల నాటికల్ మైళ్లు ప్రయాణిస్తాయి. సాగర సంగమం వద్ద ఉండే మొగల నుంచి గోదావరి నదిలోకి ఇవి ప్రవేశిస్తాయి. సంతానోత్పత్తి కోసం సముద్రం నుంచి వచ్చే ఇలస (హిల్స-విలస) చేప ఏటికి ఎదురీదుతూ గోదావరిలోకి వచ్చేసరికి పులసగా రూపాంతరం చెందుతుంది. అయితే.. కృష్ణా, గోదావరి (కేజీ) బేసిన్‌లోని ఆఫ్‌షోర్‌లో జరుగుతున్న డ్రెడ్జింగ్‌తో ధ్వని కాలుష్యం పెరిగిపోయింది. గోదావరి నదీ ముఖద్వారం (సీ మౌత్) వద్ద రిలయన్స్, ఓఎన్‌జీసీ తదితర చమురు సంస్థలు నిర్వహిస్తున్న డ్రెడ్జింగ్ పనులు పులసల రాకకు ప్రతిబంధకంగా మారాయి. డ్రెడ్జింగ్ వల్ల నీటిలో సంభవించే కంపనాలు, శబ్దాల వల్ల పులసలు గోదావరి నదిలోకి రావడం లేదు. ఏపీ తీరం వైపు రావాల్సిన పులసలు ఒడిశా, బెంగాల్ వైపు వెళ్లిపోతున్నాయి. యానాం సమీపాన గాడిమొగ, భైరవపాలెంతో పాటు అంతర్వేది, కరవాక సమీప ప్రాంతాల్లో పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాలు గోదావరి నదిలో కలుస్తున్నాయి. ప్రధానంగా సల్ఫర్, అమ్మోనియా, లెడ్, పాదరసం ఇతర కర్బనాలు నదిలో కలుస్తున్నాయి. ఆక్వా సాగులో వినియోగించే యాంటీబయోటిక్స్, పటిక (ఆలం) వంటివి కలుస్తుండటంతో పులస గోదావరి వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

విలసలే లేవు.. ఇక పులసలెక్కడివి?



సముద్రంలో విలసలు గోదావరికి వస్తేనే కదా పులసలుగా మారేది. ఇప్పుడు సముద్రం నుంచి గోదావరి వైపు అసలు విలసలే రావడం లేదు. ఒకప్పుడు జూలై వచ్చిందంటే అర్ధరాత్రి వేటకు వెళ్తే తెల్లారేసరికి 10, 15 పులసలతో తిరిగొచ్చే వాళ్లం. ఇప్పుడు ఒక్కటిండు కూడా దొరకడమే గగనమైపోతోంది. గోదావరిలో లభించే పులసల కోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చేవారు. ఇప్పుడు పులసల కోసం జనం వస్తున్నా నిరాశతో వెనుదిరిగిపోతున్నారు. గోదావరి, సముద్రం కలిసే నదీ ముఖద్వారం వద్ద యానాం సమీపాన భైరవపాలెం వద్ద చమురు కంపెనీలు గ్యాస్ పైప్‌లైన్ వేసే సమయంలో తవ్వకాల వల్ల ఇసుక మేటలు వేశాయి. ఈ మేటలు తొలగించడంతో పాటు కేజీ బేసిన్‌లో డ్రెడ్జింగ్‌పై నియంత్రణ ఉండాలి.

– పాలేపు పోసియ్య, మత్స్యకారుడు, యానాం

కలిసొచ్చిన ముహూర్తం

- కడియపులంక పువ్వుల మార్కెట్‌కు కళ
- ఆకాశాన్నంటిన ధరలు
- బంతి కిలో రూ.150



కడియపులంక పువ్వుల మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి

కడియం: కడియపులంకలోని అంతర్రాష్ట్ర పువ్వుల మార్కెట్‌కు ముహూర్తం కలిసొచ్చింది. శుభకార్యాలకు ఈ నెలలో ఆదివారంతో ముహూర్తాలు అయిపోవడంతో.. నాలుగు రోజులుగా మార్కెట్‌లో పువ్వుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని కొనుగోలుదారులు చెబుతున్నారు. ఎప్పుడూ లేనంతగా బంతి పువ్వుల ధర కిలో రూ.150 వరకు పలకడంతో విస్తుపోతున్నారు. శుభకార్యాల సందర్భంగా అలంకరణలకు ఇతర ప్రత్యేక రకాల పువ్వులు లేకపోవడంతో బంతి పువ్వులనే ప్రధానంగా వినియోగిస్తున్నారు. దీంతో వీటి ధరలు పెరిగాయని విశ్లేషిస్తున్నారు. దీనికి తోడు స్థానికంగా పువ్వుల దిగుబడి గణనీయంగా తగ్గింది. జాజులు, లిల్లీలు, మల్లెలు, కనకాంబరం వంటి రకాలు మాత్రమే ఇక్కడ ప్రస్తుతం ఉత్పత్తి అవుతాయని, బంతి, చామంతి వంటి ముఖ్యమైన పువ్వులను కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. గతంలో తగిన ధరల్లేక కాలువల్లో పారబోసిన బంతి పువ్వులకు ఇప్పుడు డిమాండ్ భారీగా పెరగడం, సాగులో అనిశ్చితికి నిదర్శనమంటున్నారు.

నాలుగు రోజులుగా..

ఒకవైపు శ్రావణ మాసం, మరోవైపు ముహూర్తాల నేపథ్యంలో గురు, శుక్ర, శని, ఆదివారాల్లో కడియపులంక పువ్వుల మార్కెట్‌లో ధరలు భారీగా పెరిగాయి. ఆదివారం మధ్యాహ్నం సమయానికే పువ్వులు లేకపోవడంతో మార్కెట్ నిర్మానుష్యంగా మారిపోయింది. కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి దాదాపు పది టన్నులకు పైగా బంతి, చామంతి పువ్వులు ఇక్కడకు వస్తే, గంటల వ్యవధిలోనే అవన్నీ అమ్ముడయ్యాయని వ్యాపారులు తెలిపారు. ఆదివారంతో వివాహాలు, గృహ ప్రవేశాలకు ముహూర్తాలు అయిపోయాయని, తిరిగి సెప్టెంబర్ 23 తర్వాతే ముహూర్తాలు ఉంటాయని పండితులు చెబుతున్నారు. చివరి ముహూర్తాలు కావడంతో పువ్వులకు భారీగా డిమాండ్ ఏర్పడిందంటున్నారు.

ధరలు ఇలా..

కడియపులంక పువ్వుల మార్కెట్‌లో ఆదివారం స్థానికంగా లభించే లిల్లీ పువ్వులు కిలో రూ.500, మల్లెలు రూ.1300–రూ.1500, జాజులు రూ.700–రూ.900 పలికాయి. అలాగే కర్నాటక నుంచి వచ్చిన బంతి పువ్వులు రూ.120–రూ.150 వరకు విక్రయించారు. తమిళనాడు చామంతులు (తడి పువ్వులు) కిలో రూ.250–రూ.300, పొడి పువ్వులు రూ.350, వైట్ చామంతి రూ.250, నీలం చామంతి రూ.270, స్టార్ గులాబీలు కిలో రూ.240, కనకాంబరం బారు రూ.220 పలికాయి.

వేద విహిత జీవనమే గుళ్లపల్లి గమ్యం

- సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ
- సీతారామచంద్ర ఘనపాఠికి రాజా–లక్ష్మి ఫౌండేషన్ పురస్కారం

రాజమహేంద్రవరం రూరల్: వేద పండితులు ఎందరో ఉన్నారు, కానీ వేదవిహిత జీవనం అలవరచుకున్న వారిలో గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి ప్రముఖులు అని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం శివారులోని కొంతమూరులో ఉన్న దత్తాత్రేయ వేద విద్యాలయం గురుకులం ప్రాంగణంలో గురుకులం గౌరవాధ్యక్షుడు గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠికి రాజా–లక్ష్మి ఫౌండేషన్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సామవేదం షణ్ముఖ శర్మ మాట్లాడుతూ, తాను వేద ధర్మాలను ఆచరిస్తూ, ఎందరో వేద పండితులను గురుకులం ద్వారా తయారు చేస్తున్న గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠికి ఈ అవార్డు రావడం ముదావహమన్నారు. భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణ రావు మాట్లాడుతూ, సంప్రదాయంలో పెద్దలను బ్రహ్మశ్రీ వేదమూర్తులు అని సంబోధించడం పరిపాటి అని, మూర్తీభవించిన వేదమూర్తులు గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి అని కొనియాడారు. అత్యంత సంప్రదాయబద్ధంగా గురుకులాన్ని నిర్వహిస్తూ, వేదమాతకు ఎనలేని సేవలను అందిస్తున్నారని అభినందించారు. ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వెంకట్రావు మాట్లాడుతూ, ఇప్పటి వరకు పురస్కారాలను చెన్నైలోనే అందజేశామని, గుళ్లపల్లి అనుష్ఠాన విధులకు భంగం కలగరాదనే ఉద్దేశంతో ఈ ఏడు రాజమహేంద్రవరంలో అవార్డు ప్రదానం చేస్తున్నామన్నారు. మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, సామవేదం షణ్ముఖశర్మ తదితర ప్రముఖుల చేతుల మీదుగా రూ.లక్ష నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో అవార్డును అందజేశారు. తనకు జరిగిన సత్కారానికి గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి కృతజ్ఞతలు తెలిపారు. దత్తాత్రేయుని ఆశీస్సులు, గురువుల అనుగ్రహంతో ఈ పురస్కారం లభించినట్టు భావిస్తున్నానన్నారు. పలువురు వేద పండితులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.



రాజా–లక్ష్మి అవార్డును అందుకుంటున్న గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి

తుపాన్ హెచ్చరికతో అప్రమత్తం

- నేడు పీజీఆర్ఎస్ రద్దు
- కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరంలో కేంద్రీకృతమైన అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నందున జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ అల్పపీడనం వచ్చే 24 గంటల్లో బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవదని హెచ్చరికలు జారీ చశారు. ప్రజలందరూ తమ ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలన్నారు. జిల్లాలో రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ

కాకినాడ సిటీ/కాకినాడ రూరల్: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడడంతో కాకినాడ పోర్టులో మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తీరం వెంబడి ఉన్న మత్స్యకారులు ఐదు రోజుల పాటు వేటకు వెళ్లొద్దని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో టాంటాంల ద్వారా సమాచారాన్ని తెలియజేస్తున్నారు. అధికారులు మత్స్యకార గ్రామాల్లోనే ఉండాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాలు జారీ చేశారు.

సముద్రంలో ఉన్నవారు ఒడ్డుకు చేరాలి

జిల్లాలో మత్స్యకారులు చాలా వరకు ఒడ్డుకు చేరుకున్నారని, ఇంకా సముద్రంలో ఉన్నవారిని ఒడ్డుకు చేరుకోవాలని సమాచారం ఇచ్చినట్టు మత్స్యశాఖ అధికారి కృష్ణారావు తెలిపారు.

అరకొర పథకాలు మాత్రమే


- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి



కాకినాడ రూరల్: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలంటూ గొప్పలు చెప్పుకుంటోందని వాస్తవానికి అరకొర పథకాలు మాత్రమే అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. పథకాల పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని, మహిళలకు రాష్ట్రంలో భద్రత లేకుండా పోయిందని ఆదివారం ఆమె మీడియా ద్వారా తెలియజేశారు. ఉచిత బస్సు, దీపం వంటి పథకాలు సంపద సృష్టించి ఇవ్వలేదని విద్యుత్ చార్జీల టారీఫ్‌లు పెంచి, ప్రజలపై ఆ భారం మోపి రూ.30 వేల కోట్లు వసూలు చేసి వాటితో అరకొరగా అమలు చేస్తున్నారన్నారు. ఉచిత బస్సులు నియోజకవర్గానికి ఒక్కటి కూడా లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్ద పీట వేసి వారి ఆర్థిక పరిపుష్టికి భరోసా కల్పించాన్నారు.

పంపాకు తగ్గని వరద

- వచ్చిన నీరు వచ్చినట్టే సముద్రంలోకి విడుదల
- 99 అడుగుల వద్ద నీటిమట్టం



వరద నీటితో పరవళ్లు తొక్కుతున్న పంపా

అన్నవరం: అన్నవరంలోని 'పంపా' రిజర్వాయర్ లోనికి ఆదివారం కూడా భారీగా వరద నీరు వస్తుండడంతో అధికారులు దాదాపు 1,200 క్యూసెక్కుల నీరు సముద్రానికి విడుదల చేశారు. ఫలితంగా నీటిమట్టం 99 అడుగల వద్ద స్థిరంగా ఉంది. పంపా రిజర్వాయర్ గరిష్ట నీటి నిల్వ 0.43 టిఎంసీ కాగా, ప్రస్తుతం 0.29 టీఎంసీ నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. నీటి మట్టం పెరిగితే మరంత నీటిని విడుదల చేస్తామని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

ఇటు వడి.. అటు జడి



బూరుగులంక రేవులో పడవపై వస్తున్న లంక గ్రామాల ప్రజలు

- కొనసాగుతున్న వర్షం
- పెరుగుతున్న వరద
- ముంపు బారిన వరి చేలు
- లంకల్లో ప్రజలు బిక్కుబిక్కు

సాక్షి, అమలాపురం: గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఒకవైపు గోదావరికి వరద పోటు తగిలింది. మరోవైపు అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు వర్షం కురుస్తోంది. వరద.. వర్షంతో ప్రస్తుతానికి ఇబ్బంది లేకున్నా, వీటి ఉధృతి పెరిగితే లంక, కొన్ని మైదాన ప్రాంతాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉంది.

గోదావరి ఎగువన కురుస్తున్న వర్షాలకు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ వరద పెరిగింది. ఆదివారం ఉదయం స్వల్పంగా తగ్గిన వరద మధ్యాహ్నం నుంచి క్రమేపీ పెరుగుతోంది. సోమవారం వరకూ వరద పెరుగుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి శనివారం రాత్రి 4,25,594 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేశారు. ఆదివారం ఉదయానికి కొంత మేర తగ్గింది. ఉదయం ఆరు గంటల సమయంలో ఇది 4,04,890 క్యూసెక్కులకు తగ్గింది. తిరిగి వరద పెరుగుతూ సాయంత్రం ఆరు గంటలకు 4,84,214 క్యూసెక్కులకు చేరింది. ఎగువన భద్రాచలం వద్ద నీటమట్టం పెరుగుతుండడంతో సోమవారం సాయంత్రానికి ఐదు నుంచి ఆరు లక్షల క్యూసెక్కుల మధ్యలో వరద వచ్చి, తరువాత తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ సమయంలో క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షం పడితే వరద మరింత పెరుగుతోందని అంటున్నారు. శుక్రవారం ఉదయం ఇన్‌ఫ్లో కేవలం 2,29,910 క్యూసెక్కులు మాత్రమే ఉండగా, 24 గంటల వ్యవధిలో 1.74 లక్షల క్యూసెక్కుల వరద పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే అవకాశముందని భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. వరద ప్రభావం నదీపాయల్లో కనిపిస్తోంది. లోతట్టు ప్రాంతాల లంకలను తాకుతూ ప్రవహిస్తోంది. అయితే ప్రతి ఏటా ఆగస్టులో గోదావరిలో నమోదయ్యే సగటు ఇన్‌ఫ్లోతో పోల్చుకుంటే ఇప్పుడు గోదావరికి వచ్చిన వరద అసలు వరద కాదని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

నీటి విడుదల తగ్గింపు

డెల్టా పంట కాలువలకు నీటి విడుదల తగ్గించారు. ఈ ప్రాంతాల్లో వర్షాలు పడుతుండడంతో ప్రస్తుతం తూర్పు డెల్టాకు 2 వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 200, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల చొప్పున మొత్తం 2,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఈ నెల 14న వరకూ 4,550 క్యూసెక్కుల వరకూ నీరు వదలగా వర్షాలతో తగ్గించేశారు.

మరో రెండు అల్పపీడనాలతో..

జిల్లాలో ఆది, సోమవారాల్లో భారీ వర్షం కురుస్తోందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ కూడా తెలిపింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

లంకల్లో భయం భయం



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉరవడి

పి.గన్నవరం: గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో పి.గన్నవరం మండలంలోని లంక గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో ఉన్నారు. వశిష్ట, వైనతేయ నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పడవలపై వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మన జిల్లా సరిహద్దులోని ఆనగర్లంక, సిర్రావారిలంక, పెదమల్లంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

జిల్లాలో అత్యధిక వర్షపాతం

24.8 మిల్లీ మీటర్లు నమోదు

కాకినాడ సిటీ: జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యధికగా 24.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో అధికంగా తొండంగి మండలంలో 39.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా గండేపల్లి మండలంలో 10.8 మిల్లీ మీటర్లు నమోదైంది. కోటనందూరు మండలంలో 36.8 మిల్లీ మీటర్లు, తుని 36.6, పిఠాపురం 36.2, ఏలేశ్వరం 26.6, కొత్తపల్లి 26.6, కాకినాడ రూరల్ 26.2, సామర్లకోట 25.4, ప్రత్తిపాడు 24.2, గొల్లప్రోలు 24.2, తాళ్లరేవు 23.2, కాకినాడ అర్బన్ 23.2, కాజులూరు 22.8, శంఖవరం 22, కిర్లంపూడి 21.4, కరప 21.2, పెద్దాపురం 19.2, పెదపూడి 17.2, జగ్గంపేట 14.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

కూలీలపై అడవి పంది దాడి

నలుగురికి గాయాలు



అడవి పందిని బంధిస్తున్న స్థానికుడు

ఐ.పోలవరం: గ్రామ పరిధిలో వరి పొలాల్లో వ్యవసాయ పనులు చేస్తున్న నలుగురు కూలీలపై అడవి పంది దాడి చేసింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గాయపడిన నలుగురినీ టి.కొత్తపల్లి ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు వారి బంధువులు తెలిపారు. గాయపడిన వారిని దంగుడు బియ్యం రాజారావు, గుత్తుల త్రివేణి పద్మావతి, బొలిశెట్టి రాంబాబు, దంగేటి వెంకటరెడ్డిగా పోలీసులు గుర్తించారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన అధికారులు.. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఇలాఉండగా పలువురు గ్రామస్తులు శ్రమించి అడవి పందిని బంధించారు. సాధారణంగా ఈ ప్రాంతంలో అడవి పందుల సంచారం చాలా తక్కువ. సమీపంలో ఉన్న మడ అడవుల నుంచి అడవి పంది ఇక్కడకు చేరుకున్నట్టు భావిస్తున్నారు. ఇటీవల కాలంలో తీర ప్రాంతంలోని సరుగుడు తోటల్లో వీటి ఉనికిని గుర్తించినట్టు స్థానికులు చెబుతున్నారు.

ముగిసిన సీబీఎస్ఈ యోగా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

బాలాజీచెరువు (కాకినాడ): సౌత్ జోన్ సీబీఎస్ఈ యోగా పోటీలు స్థానిక లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం ముగిశాయి. ఏపీ, తెలంగాణతో పాటు, తమిళనాడు, పాండిచ్చేరికి చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సంప్రదాయ యోగా, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు స్కూల్ డైరెక్టర్ సుగుణారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వందనబొహ్రా, యోగా ట్రైనర్ సీహెచ్ సుధ పాల్గొన్నారు.



ప్రకృతి పరచిన పచ్చని తివాచీ



మకరందాన్ని స్వీకరిస్తున్న సీతాకోక చిలుక



జాలర్ల బతుకు వేట

లిపి లేని కంటి భాష.. చిత్రం

- చరిత్రకు సాక్ష్యం చెప్పే ఛాయాచిత్రం
- మానవ జీవితానికి విడదీయని బంధం
- సాంకేతిక పరిజ్ఞానంతో విప్లవాత్మక మార్పులు
- రేపు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

రాయవరం: కన్ను తెరిస్తే జననం.. కన్నుమూస్తే మరణం అన్నాడో మహానుభావుడు. కానీ.. ఈ పరికరం 'క్లిక్' అంటే మాత్రం ఆ దృశ్యం కలకాలం సజీవంగా ఉండిపోతుంది. అదే ఫొటోగ్రఫీ. పరిమితులు లేకుండా ప్రపంచంలోని ఏ ప్రాంతం వారికైనా అర్థమయ్యేది.. పండితుల నుంచి పామరుల వరకు భాషకందని భావాన్ని సులువుగా అర్థం చేసుకోగలిగే ఏకైక మాధ్యమం ఫొటోగ్రఫీ. అందుకే ఫొటోలు భాషలేని.. భావ దృశ్య కావ్యాలని అంటుంటారు. క్షణకాలంలో కరిగిపోయే జ్ఞాపకాల దొంతరలను కెమెరా కన్నుతో క్లిక్ మనిపించి.. కళ్లముందు సాక్షాత్కరింపజేసేవే ఛాయాచిత్రాలు. బాల్యం.. యవ్వనం.. వృద్ధాప్యం ఇలా గడిచిపోయిన మానవ జీవనయానాన్ని కనులారా వీక్షించే అపురూప అవకాశం కల్పిస్తాయి. ఓ ఛాయా చిత్రం కోటి భావాల్ని పలుకుతుంది. చరిత్రను, సంస్కృతిని చాటిచెబుతాయి. ఫొటోగ్రఫీ అనేది అద్భుత కళ. ఇందులో నేడు విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకటిన్నర శతాబ్దాలకు పైగా ఫొటోగ్రఫీ ప్రక్రియ ఉన్నా, రెండు దశాబ్దాలుగా విప్లవాత్మక పరిణామాలు సంతరించుకున్నాయి. కెమెరా పితామహుడు డాగురేకు పేటెంట్ లభించిన రోజును ఏటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

పలు రకాల మోడళ్లు

ఫొటోగ్రఫీ ఉద్భవించి సుమారు 199 ఏళ్లవుతుంది. ఇటీవల ఫొటోగ్రఫీలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఆధునిక, సాంకేతిక విప్లవం ఫొటోగ్రఫీ దశ, దిశను మార్చేసింది. గతంలో ఫొటో తీసుకోవడమంటే గొప్ప అనుభూతి, సుదీర్ఘప్రక్రియ. ఇప్పుడు ప్రతి మనిషి వద్ద ఆండ్రాయిడ్ ఫోన్ రూపంలో కెమెరా ఉంది. ఫొటో తీసుకోవడం ఇప్పుడు సులువుగా మారింది. కెమెరాల్లోనూ రకరకాల ఫీచర్లతో రోజుకో మోడల్ వస్తుంది. అంతరిక్షం.. వైద్య రంగం.. ఇలా ఫొటోగ్రఫీ ప్రక్రియ లేనిదే ఏ పనీ జరగని పరిస్థితి నెలకొంది. రోలికార్డ్, రైస్ ల్యాండర్, రోలీ ఫ్లెక్స్, నికాన్, కేనన్ వంటి ఎన్నో కంపెనీల కెమెరాలు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. రూ.వేల నుంచి రూ.లక్షల విలువైన కెమెరాలు ప్రస్తుతం మార్కెట్లో లభ్యమవుతున్నాయి.



మలిసంధ్య సోయగం

ప్రజా సమస్యలకు అద్దం పడుతూ..

ఇలాఉండగా ప్రజల సమస్యలను పత్రికల ద్వారా అధికారులు, పాలకుల దృష్టికి తేవడంలో ఫొటోలకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. ప్రజా సమస్యలను ఎత్తి చూపడంలో ఫొటోల ఆవశ్యకత ఎనలేనిది. ఇటీవల కాలంలో సెల్‌ఫోన్ల రాకతో కెమెరాల ప్రాభవం కాస్త తగ్గినా, విలక్షణ ఫొటోలకు మాత్రం స్టూడియోలు, కెమెరాలను ఆశ్రయించక తప్పదు.

ఇంతింతై వటుడింతై అన్నట్టుగా..

ఫొటోగ్రఫీ పదం గ్రాఫోన్ నుంచి పుట్టింది. గ్రాఫోన్ అంటే రాయడం, చిత్రించడం అని అర్థం. తొలిసారి 1826లో ఫ్రెంచ్ శాస్త్రవేత్త జోసఫ్ నైసిఫర్ నిప్సీ కనిపెట్టిన తొలి కెమెరా పరికరంతో ప్రారంభమైన ఫొటోగ్రఫీ ఇంతింతై వటుడింతై అన్నట్టుగా రీల్ నుంచి డిజిటల్ పరిజ్ఞానానికి మారింది. ఫొటోగ్రఫీలో లెన్సుల ప్రవేశం తర్వాత సుదూర దృశ్యాలనూ నాణ్యత తగ్గకుండా ఫొటో తీసే విధానం అందుబాటులోకి వచ్చింది. సెల్‌ఫోన్‌లో బ్యాక్, ఫ్రంట్ కెమెరాలు అందుబాటులోకి వచ్చాక ఫొటోగ్రఫీ ఎక్కడికో వెళ్లిపోయింది. సామాజిక మాధ్యమాల్లో ఫొటోల పాత్ర కీలకంగా మారింది. ఇటీవల నాలుగు వైపులా రెక్కలతో ఆకాశంలో ఎగిరి.. చిత్రాలు, వీడియోలు తీసే డ్రోన్ కెమెరాల వినియోగం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఫొటోగ్రఫీలో డిజిటల్ యుగం నడుస్తోంది. డిజిటల్ యుగంలో డ్రోన్ కెమెరాలు కూడా వాడకం బాగా పెరిగింది.

పసితనంలోకి జారేలా..

ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించడానికి అక్షరాలు సరిపోవు. వేయి పదాలతో చెప్పలేని భావాన్ని ఒక్క కెమెరా క్లిక్‌తో చెప్పవచ్చు. అందరికీ అర్థమయ్యే భాష.. మధురమైన జ్ఞాపకం ఫొటో. తీరిక వేళల్లో ప్రశాంత సమయంలో చిన్ననాటి ఫొటో ఆల్బమ్ చూసుకుంటూ.. నాటి జ్ఞాపకాల పేజీలను తిరగేస్తుంటే మెల్లగా పసితనంలోకి జారిపోతాం. పొడవాటి చొక్కాలు.. లూజు నిక్కర్లు.. బుట్టబొమ్మల్లాంటి గౌన్లు.. పొడవాటి పావడాలు.. పిలక జడలు.. ఇలా చూసుకుంటూ.. మురిసిపోతుంటే అదో అందమైన అనుభూతి.

సర్వసాధారణంగా మారి..

గతంలో కెమెరాలు ప్రత్యేకంగా తీసుకుని వెళ్లాల్సి వచ్చేంది. ఇప్పుడు ప్రతి సెల్‌ఫోన్‌లో కెమెరా సర్వసాధారణ అంశంగా మారింది. పిండి కొద్దీ రొట్టె అన్నట్టుగా స్మార్ట్‌ఫోన్లు మార్కెట్‌లోకి వచ్చాయి. సెల్‌ఫోన్లలో కెమెరాల సామర్థ్యం గణనీయంగా పెరిగింది. ఫొటోగ్రఫీపై ఆసక్తి ఉన్న వారి కోసం ప్రత్యేకంగా సెల్‌ఫోన్ సంస్థలు తమ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. అవి మల్టీపర్పస్‌గా ఉపయోగపడుతుండడంతో ప్రతి ఒక్కరికీ ఫొటోలు తీయడం అలవాటుగా మారింది.

జిల్లాలో 140 ఏళ్ల చరిత్ర

ఫొటోగ్రఫీలో జిల్లాకు 140 ఏళ్ల చరిత్ర ఉంది. కాకినాడలో చెక్కా బసవరాజు అండ్ సన్స్ 1885లో హాబీగా ఫొటోగ్రఫీని చెక్కా బసవరాజు ప్రారంభించారు. ప్రస్తుతం నాలుగు తరాలుగా ఫొటోగ్రఫీలో వారి కుటుంబం రాణిస్తోంది. కోనసీమ జిల్లాలో 19 ఫొటోగ్రాఫర్ల సంఘాలుండగా.. 1,400 మంది ఫొటోగ్రాఫర్లు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 4 వేలకు పైగా ఫొటో స్టూడియోలు ఉండగా, భారీ స్థాయిలో కెమెరా, ఫొటో ల్యాబ్స్ 20కి పైగా ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు ఆరు వేల మందికి పైగా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు.



లేటెస్ట్ టెక్నాలజీ డ్రోన్ కెమెరా

ప్రభుత్వ సహకారం అవసరం



ఫొటోగ్రాఫర్లకు ప్రభుత్వ సహకారం అవసరం. టెక్నాలజీ అభివృద్ధి చెందడం మంచిదే కానీ, ఫొటోగ్రాఫర్ల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆండ్రాయిడ్ ఫోన్ల ప్రభావం మా వృత్తిపై తీవ్రంగా ఉంది. ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– గెద్దం సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, ఫొటో గ్రాఫర్ల సంఘం, కొత్తపేట, కోనసీమ జిల్లా

అప్‌డేట్ అవ్వాల్సిందే..



ఫొటోగ్రఫీలో ఊహించని మార్పులు చోటుచేసుకున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఫొటోగ్రాఫర్లు కూడా అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉంది. అలా కానివారు వృత్తిలో వెనుకబడుతున్నారు.

– సంగుల దొరబాబు, ప్రధాన కార్యదర్శి, ఫొటోగ్రాఫర్ల సంఘం, మండపేట, కోనసీమ జిల్లా

ఆరుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

మూడు కిలోల గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్‌కుమార్

రాజోలు: గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చినట్టు సీఐ నరేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. మలికిపురం మండలం శంకరగుప్తం గ్రామానికి చెందిన చవ్వాకుల నితీష్ అలియాస్ బంటి ఇంట్లో మూడు కిలోల గంజాయిని మలికిపురం ఎస్సై పీవీవీ సురేష్ గుర్తించారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నితీష్‌తో పాటు, రాజమహేంద్రవరం గాజుల వీధికి చెందిన అమిటి ప్రశాంత్‌కుమార్, తాడి హరీష్‌బాబు(పడమటిపాలెం), కోరుకొండ మనోజ్(బట్టేలంక), భూపతి దిషోన్ కుమార్(చింతలమోరి), గాడా శ్యాంసన్(కేశనపల్లి)ని అరెస్ట్ చేశారు. వీరిలో చవ్వాకుల నితీష్, అవిటి ప్రశాంత్‌కుమార్, తాడి హరీష్‌బాబుపై గతంలో మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు నమోదైంది. కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆదేశాల మేరకు రీ-విజిట్ కార్యక్రమంలో భాగంగా గంజాయి కేసుల్లో పాత నిందితులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఎస్సై సురేష్‌కు వచ్చిన సమాచారంతో, గంజాయి విక్రయిస్తున్న నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. వీరి తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాల్లో ఉంటున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో.. చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. 'ఆపరేషన్ సేవ్ క్యాంపస్' పేరుతో విద్యాసంస్థల్లో ఈగిల్ క్లబ్బులు ఏర్పాటు చేసి, 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు



బాణంతో లక్ష్యాన్ని గురి పెట్టిన క్రీడాకారులు

పిఠాపురం: జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఇండియన్ రౌండ్ ఆర్చరీ బాలబాలికల విభాగంలో ఈ పోటీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం, అమలాపురం, రాజోలు, కాకినాడ, తుని, పిఠాపురం నుంచి సుమారు 60 మంది ఇండియన్ రౌండ్ ఆర్చర్లు వివిధ విభాగాల్లో పాల్గొన్నారు. పిఠాపురం క్రీడాకారులు ఓవరాల్ తొలి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో కాకినాడ, మూడో స్థానంలో అమలాపురం ఆర్చర్లు గెలుపొందారు. మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ పోటీలు ప్రారంభించి, క్రీడాకారులకు పతకాలు అందజేశారు. అనంతరం కాకినాడ జిల్లా బాక్సింగ్ సంఘ అధ్యక్షుడు ఇమిడిశెట్టి నాగేంద్రకుమార్, పలువురు నాయకులు బహుమతీ ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా పి.కృష్ణ, కె.చిన్నబ్బాయి, ఎం.గణేష్, జె.ప్రసాదరావు వ్యవహరించారు. డీఎస్‌డీవో బి.శ్రీనివాస్ కుమార్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు, ఏపీ ఒలింపిక్ సంఘ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం, జిల్లా ఆర్య వైశ్య సంఘ కన్వీనర్ బోడ సతీష్ పాల్గొన్నారు.

కాకినాడలో మిత్రా హార్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్



హాస్పటల్‌ను ప్రారంభిస్తున్న శేషారెడ్డి. చిత్రంలో డాక్టర్ ఓబుల్ రెడ్డి తదితరులు

కాకినాడ రూరల్: అత్యాధునిక ఏఐ క్యాథ్, ఏఐ పరికరాలతో 24/7 గుండె, ఇతర అత్యవసర సేవల సౌకర్యాలతో కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో మిత్రా హార్ట్ ఇన్‌స్టిట్యూట్ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ జిల్లా ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఓబుల్ రెడ్డి హార్ట్ కేర్ సెంటర్‌కు అనుబంధంగా డాక్టర్ ఓబుల్ రెడ్డి నూతనంగా ఈ ఆస్పత్రిని నెలకొల్పగా, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. ఏఐ క్యాథ్ ల్యాబ్‌ను ప్రముఖ వైద్యుడు డాక్టర్ డి.రాజశేఖర్ ప్రారంభించారు. ప్రపంచ స్థాయి అత్యాధునిక ఏఐ క్యాథ్ ల్యాబ్‌ను ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో తొలిసారిగా తీసుకువచ్చామని వైద్యులు ఓబుల్ రెడ్డి, భార్గవి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ వంగా గీత, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

గోదావరిలో యువకుడి గల్లంతు

యలమంచిలి: కోనసీమ జిల్లా మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామానికి చెందిన గోకవరపు కృష్ణ (32) అదృశ్యంపై అతని సోదరుడు నాగ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ శాంసన్‌రాజు తెలిపారు. ఒక ప్రైవేట్ కంపెనీలో కృష్ణ చిరుద్యోగి. కృష్ణాష్టమి పండగ సందర్భంగా శనివారం రాత్రి ఉట్టి వేడుక చూడడానికి కృష్ణ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాత్రి ఇంటికి వెళ్లకపోవడంతో సోమవారం ఉదయం నుంచి అతడి కోసం గాలించారు. అతడి బైక్, చెప్పులు చించినాడ వంతెనపై కనిపించాయి. దీంతో కృష్ణ అన్న నాగప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. కృష్ణ ఆచూకీ కోసం గోదావరిలో గాలిస్తున్నట్టు హెచ్‌సీ శాంసన్‌రాజు తెలిపారు.

వాడపల్లికి ఉచిత బస్సు ప్రయాణం

అమలాపురం రూరల్: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే ఆర్టీసీ బస్సులకు స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఆదివారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శనివారం ఈ బస్సుల్లో మహిళా ప్రయాణికుల నుంచి టిక్కెట్లు వసూలు చేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. దాంతో వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లే ఆర్టీసీ బస్సులకు మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా ప్రజా రవాణా అధికారి రాఘవకుమార్ తెలిపారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు. చిత్రంలో నిందితులు

- రూ.9.80 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

అన్నవరం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అనేక చోరీలకు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను కాకినాడ జిల్లా అన్నవరం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అన్నవరం పోలీస్ స్టేషన్‌లో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆదివారం రాత్రి విలేకరులకు వివరాలు తెలిపారు. అన్నవరం, తుని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల పలు దొంగతనాలు జరగడంతో, ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు పర్యవేక్షణలో అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు, అడిషనల్ ఎస్సై ప్రసాద్ నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన అడపా జోగాఅమర్ గంగాధర్, అల్లూరి జిల్లా రంపచోడవరానికి చెందిన అడపా సూర్యచంద్రపై అనుమానంతో పోలీసులు నిఘా ఉంచారు. ఆదివారం ఉదయం వారిద్దరూ మండపాం సెంటర్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో చేసిన నేరాలను వారు అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసి, వారిచ్చిన సమాచారంతో రూ.9.80 లక్షల విలువైన 500 గ్రాముల వెండి వస్తువులు, అమ్మవారి గుడిలో అపహరించిన రోల్డ్‌గోల్డ్ హారం, మూడు బుల్లెట్లు, ఆరు మోటార్ బైకులు, నాలుగు స్కూటీలు, ఎల్ఈడీ టీవీ స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై హైదరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రెండు, విశాఖపట్నం జిల్లా అరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఎనిమిది, తుని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మూడు, ప్రత్తిపాడు, తుని టౌన్ పోలీస్‌స్టేషన్లలో ఒక్కొక్క కేసు నమోదైనట్టు డీఎస్పీ వివరించారు. వీరిని ప్రత్తిపాడు కోర్టుకు తరలించినట్టు చెప్పారు. సమావేశంలో ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు, ఎస్సై శ్రీహరిబాబు, అడిషనల్ ఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

దూసుకొచ్చిన మృత్యువు



కారు ఢీకొనడంతో బోల్తా పడిన ఆటో



సంఘటన స్థలంలో పడి ఉన్న నిమ్మితి ఏసు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- కోరంగిలో ఇద్దరిని బలిగొన్న అతివేగం
- పాదచారి, ఆటోను ఢీకొన్న కారు
- మరో మహిళకు గాయాలు

తాళ్లరేవు: మృత్యు రూపంలో అతివేగంగా దూసుకొచ్చిన కారు ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఆదివారం కోరంగిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీ పనికి వెళ్లి, ఇంటికి తిరిగి వెళుతున్న పాదచారితో పాటు, చర్చిలో ప్రార్థనలను ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కిన మహిళ దుర్మరణం పాలయ్యారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాతీయ రహదారి 216లోని కోరంగి పెంతెకోస్తు చర్చి వద్ద ఆగి ఉన్న ఆటోను యానాం నుంచి కాకినాడకు వెళుతున్న కారు వేగంగా వచ్చి.. తొలుత పాదచారిని, తర్వాత ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో కొత్త కోరంగి గ్రామానికి చెందిన నిమ్మితి ఏసు(50) అక్కడికక్కడే మృతి చెందగా, ఆగి ఉన్న ఆటోలో కూర్చున్న పాత కోరంగి గ్రామానికి చెందిన అరుబరుగుల లక్ష్మి(58) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆటోలో ఉన్న మరో మహిళ దడాల ధనలక్ష్మికి గాయాలు కాగా, స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

చిన్నారులు సురక్షితం : ఇలాఉండగా ఆటోలో ఉన్న మరో నలుగురు చిన్నారులు ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. మృతుడు ఏసు భార్య హైదరాబాద్‌లో ఉండగా, వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలాగే పాత కోరంగి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన హెల్పర్‌గా పని చేస్తున్న లక్ష్మి భర్త పదేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమె తన ఇద్దరు కుమారుల వద్ద ఉంటోంది. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్సై సత్యనారాయణ తన సిబ్బందితో హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. వివరాలు సేకరించి, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. కాగా సంఘటన సమయంలో ముగ్గురు వ్యక్తులు కారులో ఉన్నట్టు స్థానికులు అంటున్నారు. కారులో కొన్ని మద్యం బాటిళ్లు కూడా ఉన్నాయంటున్నారు. దీంతో వారు మద్యం సేవించి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కారులో ఉన్నవారిలో ఇద్దరు పరారు కాగా, ఒకరిని పోలీసులు అదుపులో తీసుకున్నట్టు తెలిసింది.



నిమ్మితి ఏసు(ఫైల్)



అరబరుకుల లక్ష్మి(ఫైల్)

విశ్రాంత ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

నిందితుడి అరెస్టు, రిమాండ్

కాట్రేనికోన: తల్లీకుమార్తెను లైంగికంగా వేధించినట్టు అందిన ఫిర్యాదు మేరకు ఓ విశ్రాంత ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని దొంతికుర్రుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లాడి చిరంజీవిబాబు(చిరంజీవి మాస్టార్)ను పోక్సో కేసులో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై అవినాష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు, బ్రహ్మసమేధ్యం పంచాయతీ నీళ్లరేవుకు చెందిన చిరంజీవిబాబు, బాధిత మహిళ కుటుంబం దొంతికుర్రులో నివసిస్తున్నారు. వివాహితతో పాటు, ఆమె మైనర్ కుమార్తెను చిరంజీవిబాబు లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. లైంగిక వేధింపులకు సంబంధించిన ఫొటోలను నిందితుడు సెల్‌ఫోన్‌లో బంధించాడు. ఆ ఫొటోలను ఇతరులకు పంపడంతో, అవి కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సెల్‌ఫోన్‌తో తీసిన ఫొటోలను చూపించి చిరంజీవిబాబు తనను బ్లాక్‌మెయిల్ చేస్తూ, లైంగిక వేధింపులకు పాల్పడేవాడని బాధిత మహిళ ఆరోపించింది. తనతో పాటు, తన మైనర్ కుమార్తెను లైంగికంగా వేధిస్తున్నాడంటూ.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలతో ఆమె శనివారం రాత్రి కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని అరెస్టు చేసి ముమ్మిడివరం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించడంతో, రాజమహేంద్రవరం సెంట్రల్‌కు తరలించినట్టు ఎస్సై అవినాష్ తెలిపారు.